
(పెద్ద కథ)

# తాను వెలిగించిన దీపం



అంత వరకూ బాగానే పరుగెడుతూ తన నామధేయం లోని ప్రథమార్థాన్ని శాయశక్తులా సార్థకం చేసుకుంటూ వొచ్చినది కాస్తా – తన పేరులోని రెండవ సగాన్ని కూడా సత్యమని చాటుకోవాలనో; రైలూ బస్సూ అప్పాచెల్లెళ్ళే, ఆ తానులోని ముక్కలే రెండూ అంటూ తమ బాంధవ్యాన్ని తెలియజెప్పాలనో; నిదానమే ప్రధానమనే రోడ్డు రవాణా సంస్థవారి సూత్రాన్ని తానూ అనుసరించి చూద్దామని హఠాత్తుగా చిలిపి సరదాయే పుట్టిందో – పరుగులోంచి నడకలోకి దిగసాగింది రైలుబండి.

"రాజమండ్రి" వాళ్ల వూరు వొచ్చేస్తూందన్న ఉత్సాహంలో కాబోలు ఎవరో అరిచారు. ఈ కాలంలో కూడా వున్నవూరన్నా, కన్నవారన్నా ఆపేక్షలు కలవారుండడం విశేషమే. రాజమండ్రి అన్న పదం – గోదావరి అన్నట్లు వినిపించింది కపర్దికి. అతనికి నగరాల నామధేయాల కంటె నదుల పేర్లే మక్కువగా మధురంగా వుంటాయి. నదుల నాశ్రయించుకునే నగరాలు ఆవిర్భవించాయి. నాగరికత పరిఢవిల్లింది. నదులే లేకపోతే నరుడూ లేడు, నగరాలూ లేవు, నాగరికతా వుండదని చరిత్ర చెప్పే సత్యం.

ధూమశకటం పెళ్ళివారి అడుగులు వేస్తూంది... నత్తనడకలోకి దిగి... ఆగిపోయింది. వాళ్ళిల్లు వొచ్చేసినట్లు... వాళ్ళమ్మని చేరేసినట్లు.

"ఇక్కడ కనీసం పావుగంటయినా పడుకోకుండా కదలదీ పొగబండి. కనుక –" అని వెనుక సీట్లలోని ఒక కుర్రాడంటే – మరొక కుర్రాడు ఆ గద్యానికి వచన కవితను జోడించాడు.

"దిగండి దిగువకు పానాసక్తులు
దిగండి దిగువకు ఖానాసక్తులు
దిగండి దిగండి ధూమాసక్తులు
దిగుదిగు దిగండి నానాసక్తులు"

"కతికేవారూ, కాల్చేవారూ... కాఫీ వారు –
కాలుసారించదలిచినవారూ... దిగండి కిందకి
దిగండి దిగువకు."

ఆసుకవిత్వం చెప్పాడో కుర్రాడు అద్భుతంగా. అనుకరణా అనుసరా ఐతే ఏం? ఈ కాలం కుర్రాళ్లు చాకులూ బాకులే. చాలా తెలివయిన వాళ్లు. ఇంతసేపూ వాళ్లు చేస్తూ వొచ్చినది వొట్టి అల్లరి కాదు. అందమైన తెలివైన అల్లరి. అందుకే ప్రయాణం సరదాగా సాగింది వారి అల్లరి చలువన. వాళ్లూ బెజవాడ వరకూ వొస్తే బాగుండును – అనుకున్నాడు కపర్ది మనసులో.

చాలామందే దిగుతూంటే – కపర్ది కూడా అసంకల్పితంగా లేచి నిలుచున్నాడు. కూర్చుని కూర్చుని కాళ్లు కదుములు కట్టాయనుకున్నాడు. అలా అవిపించేసరికి అతనికే నవ్వొచ్చింది. ఈ బండి కోసం ఎదురుచూపులో నిలబడవలసి వొచ్చి ఎంతటెంతట

రైలులోకి వెళ్లిపడతామా హాయిగా కూర్చుంటామా అని కొట్టుకుపోయాడప్పుడు – కొన్ని గంటల కిందట. బండీ వొచ్చింది, కిటికీపక్క చోటూ దొరికింది వరంలా. హాయిగా కూర్చున్నాడు. అయినా తృప్తి లేదు. ఇందుకేనేమో మనిషి కోరి కల పుట్ట అన్నారు. కూర్చుంటే నిలబడాలని; నిలబడితే కూర్చోవాలని – మండు వేసవి చల్లగా వుండాలనీ, చలి కాలం వేడిగా వుండాలని... ఎప్పుడూ అప్పుడున్న దానికి విరుద్ధంగానూ విపరీతంగానూ వాంఛించే నరజాతి! వా నరజాతి! తానూ ఆ జాతికి వారసుడే. వేదాంతిలా మందహాసం చిందిస్తూ... తన పెట్టెను పక్కవారికి “భద్రం” చెప్పి బండి దిగాడు. పదడుగుల మేర – పదచలనం. ఆ మాత్రానికే కాళ్ల గుదులు వదలి... కీళ్లు పట్టు వదలి... ప్రాణానికి సుఖంగా అనిపించింది. వాహ్యాళికి మించిన వ్యాయామం వేరొకటి లేదన్న సత్యం నిరూపించబడినట్లే అయింది. ఇంతకంతయితే అంత కెంతో అన్నట్లు యింకా నడిస్తే ఎంత బాగుంటుందో చూద్దామని ప్లాటుఫారం కొసవేపు కాలు సారించాడు. గాలి అలలు. గోదావరి నది మీదుగా వొస్తున్న నీటి గాలులేమో మహా బాగుంది చల్లగా. వొంట్లోని అలసట తీరుతూ... ప్రయాణపు విసుగు విరుగుతూ... శరీరానికీ, మనసుకీ కూడా సేదతీరుతూ సుఖంగా... స్వర్గంలో లాగే వుంది. కపర్ది ముందుకి నడవసాగాడు ఉత్సాహంగా. అప్పుడు... పసుపు పచ్చని గోడ మీది నల్లని అక్షరాలపై పడిందతని దృష్టి అప్రయత్నంగా.

“రాజమండ్రి”

అతను వివశుడే ఐపోయాడు. అతని మస్తిష్కపు మహాగ్రంథంలో వెనుకటి పుటలేవేవో రెపరెపలాడసాగాయి. అతనట్టే నిలిచిపోయాడు వింత చూస్తున్నట్లు విభ్రాంతుడైనట్లు.

రాజమండ్రి... రాజమహేంద్రవరం... గోదావరీ తీరం.

ఆది కవి నన్నయ. మహాభారత పర్వాలు. తెనుగు సాహిత్య సర్వస్వాలు.

రాజమహేంద్రవరం... రాజరాజ నరేంద్రుడు... సారంగధర... చిత్రాంగి... తప్పొప్పలు విప్పి చెబుతూ కనువిప్పు కలిగించే విదారక గాథ.

గోదావరీ తీరం... “గోదావరీ తీరమందు పెద్ద బూరుగు వృక్షము కలదు–” పంచతంత్ర కర్త... ప్రపంచ జ్ఞాన ప్రదాత. పరవస్తు చిన్నయసూరి... తెనుగు వ్యాకరణ ప్రదాత. గోదావరి... ఆనకట్ట... కాటన్ దొర... నాగరికతకు సోపానం.. ఆంధ్ర దేశాన్ని అన్నపూర్ణని చేసిన అఖండుడు. అనేక మందికి అన్నదాత.


గోదావరీ తీరం... రాజమండ్రి... హితకారిణీ సమాజం... కందుకూరి వీరేశలింగం.. వితంతుల పాలిటి విశ్వ స్నేహితుడు. సంఘ సంస్కరణా సోపానం.

చల్లని తల్లి గోదారి. చదువుల తల్లి గోదావరి. వెన్నెట్లో గోదారి విలక్షణ సౌందర్య కాణాచి. గలగలా గోదారి... కదిలిపోతూంటేనూ...

కపర్ది మనో నేత్రం ముందు మహత్తరమూ మధురాతి మధురమూ అయిన అనుభూతిని కలిగించే మనోహర దృశ్యాలు... చైతన్యస్రవంతిలో వలె. గోదావరి దర్శనమిస్తుందేమో అని ఆశగా అటూ ఇటూ సాగినంత మేరా దృష్టి సారించి చూశాడు. కాని... అంతలోనే...

నీ ఆశ అడియాస... అత్యాశ... పేరాశ అంటూ వెయ్యి నోళ్లతో వెక్కిరిస్తున్నట్లూ – వినేవారి వీనులూ. .. బలహీనుల గుండెలూ బద్దలయ్యేటట్లూ – కర్కశంగానూ బిగ్గరగానూ రైలు కూత. ఉలిక్కిపడి... కర్తవ్యమూ... యిహలోకమూ... సాగించవలసిన ప్రయాణమూ స్మరించి – తానెక్కవలసిన రైలు పెట్టెవేపు నడవసాగాడు కపర్ది. అప్పుడే ఏవో రైలు వొచ్చినట్లుంది – పరిసరాలు జనమయమయ్యాయి. మనుషులని




# ఇచ్ఛాపురపు రామచంద్రం

తప్పించుకుంటూ... వారిచే తోయబడుతూ... ఎవరెవరి కాళ్లో తొక్కుతూ... హడావిడిగా తన రైలు వేపు అడుగులు వేస్తున్న కపర్ది కతి చేరువలో – "సారూ!"

నవ్వే వొచ్చిందతనికి. రైల్వే ప్లాట్‌ఫారం మీద అలాటి పేరు లేని పిలుపులు... వందల మంది నడిచే రోడ్డు మీద చప్పట్లు... వల్లకాట్లో రామనాథాలూ, శతకోటి బోడిలింగాలలో ఒక బోడిలింగమూ మాదిరే. మతిలేకపోతే సరి – మందిలో అలా అరవడానికి. విసుక్కుంటూ ముందుకి వెళ్ళిపోబోతూంటే – చేయి పట్టుకు మరీ ఆపాడతగాడు. కోపంగా పక్కకి తిరిగి చూశాడు. తెలిసిన ముఖంలా అనిపించలేదు. అవతల రైలెక్కవలసిన కంగారు. అతనికి కొంచెం కోపమొచ్చింది. "మీ రెవరో కాని పొరపాటు పడ్డారు–" కసిరినట్లే అని చెయ్యి విదిలించుకోబోయాడు. దానితో అవతలి వ్యక్తి విలువునా నీరైపోయి. .. చాలా దెబ్బ చావు దెబ్బ తిన్నవాడిలా చూస్తూ – "అదేమిటి సారూ! నన్నే మరచిపోయారా? నేను... నేనండీ.. యాదగిరిని.. యాదస్తులేదూ? ఆనవాలు కట్టలేకపోయారా నన్ను? అనకాపల్లిలో.. " అంటూ ఆగాడు – తనని తాను గుర్తుచేసుకుందుకామాత్రం చాలన్నట్లు.

కలయో వైష్ణవ మాయయో అన్న విభ్రాంతిలో పడిపో యాడు కపర్ది. ఈయన యాదగిరా! ఆ యాదగిరెక్కడ, యీ యాదగిరెక్కడ? ఆనాటి యాదగిరి సైకిళ్లూ అవీ బాగుచేస్తూ బ్రతికే మెకానిక్... నిక్కరూ... బనీనూ నూనె మరకలు.. మనిషి నల్లగా బండగా... ఇతను... ఈ యాదగిరేమో సూటూ బూట్లలో స్టయిలుగా... కొంచెం సంస్కారవంతుడిలా... ఎంత ఆశ్చర్యం! జీవితమంటే ఆశ్చర్యాల సంపుటే కావొచ్చు కానీ ఆ గొంగళీయే ఈ సీతాకోక చిలుకంటే నమ్మశక్యంగాకుండానే వుంది మది.

"నువ్వు నిజంగా యాదగిరివే? ఎంత మారిపోయావు!"

"అదృష్టం సారూ, అదృష్టం. అదృష్టవంతుణ్ణి ఎవరూ చెరపలేరు సారూ–" చిరునవ్వు.

"ఏమిటి నీ అదృష్టం?" "విందురు... చూద్దురు... ముందు కాఫీ తాగుదాం సారూ... కాఫీ తాగుతూ కబుర్లు కలబోసుకుందాము సారూ!"

"నా బండి బయలుదేరిపోతుంది–"

"ఈ బండేగా? ఇదింకా పావు గంట వరకూ కదిలేది లేదు సార్. నేనీ బండిలోనే ఏలూరెళ్తున్నానుగా... మీ రెంతవరకూ సారూ?"

"బెజవాడ"

"మంచి కాఫీ తాగుదురు కాని రండి సారూ"

వొత్తిడికి లొంగిపోయాడు కపర్ది. కొందరిని తప్పించుకోవాలంటే వారికి లొంగిపోడం కంటే గత్యంతరముండదొక్కొక్కప్పడు. కపర్ది యాదగిరితో కాఫీశాల వేపు నడవక తప్పలేదు. నిజానికతనికి యాదగిరితో పెద్ద అనుబంధమేమీ లేదు. ఎనిమిదేళ్లవుతూందేమో... ఆ రాత్రి తన దగ్గరికి వొచ్చాడు వాడిపోయిన ముఖంతో. "నేను మల్లి మేనమామని సారూ... మెకానిక్ పనులు చేసుకుంటూ బతుకుతున్నాను. మల్లంటే నాకు చచ్చేంత ప్రేమసారూ... అది కాదంటే నాకు బతుకే వుండదు సారూ... అది నన్ను పెళ్లి చేసుకునేలా మీరు వొప్పించగలిగితే – నా చర్మంతో మీకు చెప్పలు కుట్టించి మీ రుణం తీర్చుకుంటాను సారూ..." అంటూ ఏడుస్తూ కాళ్ల మీద పడ్డాడు.

మల్లేశ్వరిని మల్లి అని పిలిచే హక్కు తన వాక్కుడికే ఇచ్చింది. అందాల బొమ్మ... అందానికి తగ్గ ఆత్మవిశ్వాసం. కొంచెం చదువు.. మసివాతలలో మాణిక్యం – ఆమె గురించి మూడు ముక్కలలో చెప్పాలంటే –

"మీరు చెబితే కాదనదు సారూ! దానికి వాళ్లమ్మా అయ్యల కంటె మీరే ఎక్కువ."

కావొచ్చు. అందుకే అలా చెప్పడం అసలు కుదరదు. దొండపండూ! నువ్వెళ్లి కాకి ముక్కుకి కట్టుకో అని చెప్పడానికి తను – మనిషి. అమానుషుడు కాదు. రాయి మట్టిలోనే వుండాలనీ రత్నం బంగారంలోనే పొదగబడాలనీ కోరే సిద్ధాంతం తనది. సత్యమయినా అప్రియం చెప్పకూడదనేది తన అభిప్రాయమే కనుక – మౌనంగా వుండిపోయాడు – "మల్లిని నాదాన్ని చేసి నా బతుకు నిలపండి భగవంతుడా! నన్నదృష్టవంతుణ్ణి చెయ్యండి సారూ!" అంటూ యాదగిరి పరిపరివిధాల ప్రార్థించినా.

"నా అదృష్టం – మల్లిని నేను పెళ్లి చేసుకోకపోవడమే" ఘొల్లున నవ్వాడు యాదగిరి – "ఆ పెళ్లి జరగకపోడమే నాకు గొప్ప అదృష్టమయింది సారూ!"

కొరడాతో ఛెళ్లున కొట్టినట్లే అయింది కపర్దికి. తాగుతున్న కాఫీ కాలకూట విషయమే అయి కంఠం దిగలేకపోతోంది. గొంతు పెగలడం లేదు. అతన్ని ప్రతిఘటించడానికయినా. ఎంత దారుణమయిన మాట అన్నాడు దుష్టుడు!

"ఆ పెళ్లి జరగకపోడంతో అక్కడుండలేక మకాం మార్చేశాను పట్నానికి. ఒకరు తగిలి – "న పిల్లని పెళ్లాడితే కువాయిట్ పంపుతానన్నాడు. పిలిచి పిల్లనీ, అదృష్టాన్నీ యిస్తానంటే వొద్దనడానికి నేనేమయినా వెర్రి వెధవనా? పెళ్లి... కువాయిట్... నా దశ తిరిగిపోయింది. దరిద్రం వొదిలిపోయింది. రెండు చేతులా ఆర్జించాను. డబ్బే డబ్బు..." బండవాడివి. నీలాటివాడికి డబ్బే జీవితం. ఎద్దుకి అటుకుల రుచిలా నీకేం తెలుసు జీవితంలోని నిజమైన ఆనందాలు?

"ఓ పిలగోడు పుట్టాడు. రెండేళ్లకొసారొచ్చి రెణ్నెల్లు ఇండియాలో పెళ్ళాం, పిల్లాడితో గడిపి వెళ్తూంటాను. ఇప్పటికే నాలుగు లక్షలు నిలవేశాను. మా ఆవిడా పిల్లడూ ఫస్టు క్లాసు డబ్బాలో వున్నారు. చూద్దురుగాని రండి."

మనిషికి – సాధించడంలో కంటె... తాను సాధించిన దానికి యితరులు మెచ్చుకుంటూ ఈర్ష్య పడుతూండడంలోనే ఎక్కువ సంతృప్తి లభిస్తుందేమో. అందులోనూ యాదగిరిది – నడమంత్రపు సిరి. నరం మీద వుండూ... నిలవనిస్తాయా? అతని గొప్పతనానికిప్పుడు తను ప్రేక్షకుడూ పావూ అవాలన్న మాట.

"మరెప్పుడేనా..." తప్పించుకునే ప్రయత్నం చేయబోయాను.

"ఇంకెప్పుడు సారూ! రండి. మీరు తగలడమే భలే ఆనందంగా వుంది నాకు. కాదనకండి." కపర్ది చెయ్యి పట్టేసుకున్నాడు యాదగిరి. అది కపర్దికెంత మాత్రమూ నచ్చలేదు. మల్లిని అంత మాటనడంతోనే యాదగిరి తనకు శత్రువైపోయాడు. తన ఆరోప్రాణమూ, అందమైన ప్రాణమూ అయిన మల్లిని – 'దురదృష్టం'గా దూషించిన ఈ దుర్మార్గుడు ఏ అధికారంతో, ఏ చనువుతో తన చెయ్యి పట్టుకున్నాడు? ఆ జులుము డబ్బిచ్చిందా? యాదగిరికి తెలియదేమో తన గురించి పూర్తిగా. తను డబ్బుకి మనిషికి కంటె ఎక్కువ విలువేమీ ఇవ్వడు. ఎంత ధనవంతుడయినా అతని పాటకు తాను నాట్యం చేయడు. ఏ క్షణంలో మల్లిని అంత మాటన్నాడో ఆ క్షణానే యాదగిరి తనకి అయిష్టుడైపోయాడు. తను అతని వెంట వెళ్ళడుగాక వెళ్ళడు... తీవ్రంగా అనుకున్నాడు. గట్టిగా నిర్ణయించుకున్నాడు. కాని.. అప్పటికే... అతనికి తెలియకుండానే.. అతని సంకల్పానికి విరుద్ధంగానే.. అతనా మొదటి తరగతి పెట్టెలో వున్నాడు. మొహమాటానికి పోయిన వారెక్కడికి పోతారో వారికి తెలియదు కదా? మొహమాటానికి పోతే ఏమౌతుందో ఎవరికీ తెలియదు కదా?

"నా భార్య–" అంటూ యాదగిరి చెబుతూంటే ఆమె వేపు చూడకా తప్పలేదు, ముఖాన చిరునవ్వు పూయించకా తప్పలేదు. సభ్యతాసంస్కారాలు కొన్ని సందర్భాలలో మనిషిని కోపతాప ద్వేషాలు ప్రదర్శించలేని అసమర్థుడినీ ఆటబొమ్మనీ చేయగలవు మరి. మనసులో మాత్రం మహా కసిగా... యాదగిరి దంపతులు పరస్పరానుకూలురే కావొచ్చుకానీ

ఆసానుకూల్యం కృపిడీ యునువగొడ్డళ్ల అమరిక వంటిదే. ఆమె వంటి నిండా బంగారమే కానీ వాళ్ళు మాత్రం నల్లరాయి. యాదగిరి మాత్రం తన బండ రూపాన్ని ఖరీదయిన సూటూ వాచీ వంటి వాటితో కప్పకోలేదూ?

ఛఛ... ఇదేమిటే తను యిలా ఆలోచిస్తున్నాడు? అందని ద్రాక్ష పుల్లన అయి యాదగిరి మల్లిని 'శని' అని మాట తూలవొచ్చు. అంతమాత్రాన అతని పట్లా... అతనివారిపట్లా యింత ద్వేషం న్యాయమా? వారి రూపాలకు వారేం చేయగలరు? ఏ మనిషీ తన అందానికీ కులానికీ బాధ్యుడు కాడు కదా? రూపమున్న చోట గుణమూ వుంటుంద నేది సర్వకాల సర్వావస్థలలోనూ సర్వుల యెడలా సత్యం కాదు కదా?

"మీ సామాను నేను తెప్పిస్తాను కానీ మీరూ మాతో మా పెట్టిలో కూర్చోండి సారూ సుఖంగా. ఏలూరు వరకూ ఎన్నో కబుర్లు చెప్పకోవచ్చు. టీసీ. వొస్తే నేను డబ్బు కట్టేస్తానులెండి. మీ గురించేమీ చెప్పనే లేదు-"

యాదగిరి మాటలు విషం కంటె చేదుగానూ... వికృతమయిన ప్రణాళికను పొందుపరచుకున్నట్లుగానూ వినిపించాయి. ఇప్పటికీ తానయిన పాత్ర చాలక... పావు చాలక... అతని ఐశ్వర్య ప్రదర్శనకు తననింకా ప్రేక్షకుడిని చేసి గొప్పతనం చాటుకుంటూ ఆనందించాలనుకుంటున్నాడన్న మాట. అలాగ తను చచ్చినా పడనివ్వడు. తన ఆశారేఖా... అంచనాల ఆలవాలమూ అయిన మల్లిని తన విషపు మాటతో కాటువేసిన ఈ పాము పడగనీడలో ఇంకా మరికొంత సేపా?

"లేదు... అలా వీల్లేదు... నేను వెళ్లాలి, వెళ్ళిపోవాలి"

అదే క్షణంలో దైవం అనుకూలించినట్లు - రైలు కూసింది బయలుదేరతానంటూ.

"ఉత్తరమయినా వ్రాయండి. ఇదుకో నా చిరునామా.." అంటూ అచ్చు కార్డందించాడు యాదగిరి. విధిలేక అందుకుని... విసవిస నడుస్తూ... తన పెట్టి చేరుకుని చోటులో కూర్చునేసరికి రైలు కదిలింది. యాదగిరి ఇచ్చిన చిరునామా కార్డు చింపేద్దామనుకుంటూనే ఎందుకో అంతలోనే మనసు మార్చుకుని సూట్‌కేసులో పడేశాడు.

రాజమండ్రి స్టేషను వెళ్ళిపోతోంది - వెనక్కి.... దిగగానే ఎంత ఆనందం కలిగించిందో... తరువాత అంత అశాంతిని మిగిల్చింది.

"ఏ నిముషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ.." బిచ్చగాడిపాట వినిపించి - అటు చూశాడు కపర్ది. బిచ్చగాడు కనిపించలేదు కానీ - ఆ మూల చోటులో బల్లమీద ఒక జంట. ఆమె చాలా బాగుంది. మల్లిని జ్ఞప్తికి తెచ్చేటంత అందంగా వుంది. ఆరోగ్యంతో మెరిసిపోతోంది. ఐశ్వర్యం కురిసిపోతూంది. లక్షణంగా వుంది. లక్ష్మీదేవిలా వుంది. సకల సుఖాలతోనూ, సంతోషంగా, హాయిగా వుంటున్నట్లుంది. ఆమె పక్కన భర్త... ఆమె కన్నివిధాలా సరితూగుతున్నాడు. ఆ దంపతులిద్దరూ ఒకరికొరకొకరు అన్నట్లు... మంచి దేముడు చేసిన అతి చక్కని జంటలా వున్నారు. తన మల్లి కూడా యిలా వుంటే...

ఎందుకుండదూ? వుండే వుంటుంది. ఇంకా ఆనందంగా హాయిగా వుండి వుంటుంది. ఉందా? - ప్రశ్న. ఏమో.. అంతలోనే సందేహం.

భగవంతుడా! నేను నిన్నింతవరకూ ఏమీ కోరలేదు. ఇప్పుడు ఒకే ఒక్క వరమడుగుతున్నాను. కాదనకు. మల్లిని యాదగిరి కంటె కూడా చక్కని స్థితిలో ఆయురారోగ్య ఐశ్వర్య దాంపత్య సౌఖ్యాలలో - వుంచు. చేతులు జోడించాడు కపర్ది.

దడదడ... దడదడ... గుండెలదిరేలా చప్పుడు. రైలు గోదావరి వంతెన మీద - కఠినంగానూ, కర్ణకఠోరంగానూ శబ్దం చేస్తూ... పరుగు. ఎవరిదో కంఠం "గోదావరి..." నలుగురితో పాటూ తనూ చిల్లర డబ్బులు గోదావరిలోకి విసిరాడు. వ్యర్థమూ నిష్ప్రయోజనమూ అని తెలిసినా మనిషికి కొన్ని అలవాట్లు పోవు. మందిలో మనిషి.

గోదావరి వెనక్కి వెళ్ళిపోయింది. దానితోపాటే వంతెనా, శబ్దమూ. రైలు పరుగెడుతోంది. కపర్ది - సభ్యతాసంస్కారాలను కూడా విస్మరిస్తున్నాడు - ఆ మూల బెంచీ మీద కూర్చున్న జంటలోని ఆమెను వీలయినంతగా వీక్షించాలనే విశ్వప్రయత్నంలో ఎవరయినా ఏమయినా అనుకుంటారేమో అన్న ఆలోచన కాని అనుమానం కాని రావడమే లేదతనికి.

మల్లి ఇప్పుడు ఇలాగే... ఈమెలాగే వుంటుందా? రైలు కుదుపు. అదోక రకం మత్తు. కిటికీలోంచి - పొలాలూ అవీ వెనక్కి వెళ్ళుతున్నట్లు. అతని మనసు కూడా వెనక్కి... జ్ఞాపకాలలోకి...

కపర్దికి నవ్వొచ్చింది. తన ప్రయాణం - శారద (అనకాపల్లి) నుంచి కృష్ణ (విజయవాడ)కి. మధ్యలో గోదావరి (రాజమండ్రి). ఇప్పుడు మళ్ళీ వెనక్కి. రైలు ముందుకూ - జీవన ప్రయాణం వెనక్కీ.

xxxx

అచ్యుతాపురానికీ అనకాపల్లికీ దూరమయితే పది పన్నెండు మైళ్లు కూడా వుండదు కానీ... అనకాపల్లి కాస్త పెద్దదీ, అచ్యుతాపురం చాలా చిన్నదీ. అచ్యుతాపురంలోనే గుమాస్తాగా చేసేవాడు కపర్ది. ఆదెమ్మ ఆ యింటి పనిమనిషి. సింహాచలం రిక్షాలాగే వాడు. కష్టానికీ సుఖానికీ అతనూ కపర్ది వద్దకువొచ్చేవాడు.

ఆదెమ్మా, సింహాచలమూ యిద్దరికిద్దరే మంచితనంలోనూ నిజాయితీలోనూ. ఒక రోజు... ఆదెమ్మతోపాటు ఓ పిల్ల వొచ్చింది. పన్నెండో, పదమూడో వుంటుందేమో వయసు. జామిపండు రంగు. అటు సన్నమూ కాక యిటు లావూగానూ కాక ఏరాశిగా... బంగరు శలాకలా వున్న ఆ అమ్మాయి చిలకలా కులుకుతూ... సీతాకోక చిలుకలా ఉలుకుతూ... యింటి ముందున్న పూలతోటను చూడడమేమిటి తురున పారిపోయింది మొక్కల మధ్యకు. ఆ పాప అతి చక్కనిది. చుక్కలా వుంది. పూలమొక్కల నడుమ పూబాలలాగే వుంది. చూడముచ్చటగా వున్న ఆ చిన్నారిని పలకరించి చూడాలనిపించింది కపర్దికి.




వృత్తికి గుమాస్తా ఐనా ఆ వృత్తికి సాహితీప్రియుడూ, సరసుడూ, రసికుడూ, భావుకుడూ జన్మతః సౌందర్యాభిలాషీ సౌందర్యారాధకుడూ ఐన కపర్దికి ఆ పల్లెలో సాహిత్యమూ సరదాలే కాలక్షేపాలు. సుందరం శాశ్వతానంద మన్న కీట్సు అంటే అతనికభిమానం.

"పాపా!" పిలిచాడా అందాల బాలను. పూలలో పూవులా వున్న పసిదాన్ని.

"దాని పేరు - మల్లండి -" అంది ఆదెమ్మ అతని వెనుకనుంచి. అంతే. ఒక్క అంగలో అక్కడికి ఛంగున దూకి - "నా పేరు మల్లీ కాదు, బుల్లీ కాదు. మల్లీశ్వరి. అలా పిలిస్తేనే పలికేది-" అంది అతి రోషంగానూ అమిత బింకంగానూ.

ఆదెమ్మ ఏదో అనబోతే వారించి ... "మల్లీశ్వరి! నీ అంత చక్కగా వుంది నీ పేరు. మల్లీశ్వరీ దేవీ! మీ అమ్మానాన్నలెవరు?" ఆమె చిలుక పలుకుల తీయదనం మరింత అనుభవిద్దామని ఆ ప్రశ్న వేశాను. చందమామ తల్లి దండ్రుల గురించెందుకూ?

"మా బొట్టేనండి" యాదమ్మ చెప్పింది వినయంగా.

"బొట్టూ గిట్టూ కట్టూ తిట్టూ బొబ్బట్టూ - " మల్లీశ్వరి తల్లిని వెక్కిరించింది.

"మా పెంకిది బాబూ"

"మీ అమ్మాయే ఐతే యిన్నాళ్లూ ఏమైంది? కనిపించలేదే?"

"వాళ్ళకి సంతులేక ఇల్లు సందడి లేదని పెద్దమ్మ దీసినుంచేసుకుంది బాబూ యిన్నాళ్లూ తవింట. పిల్ల పెద్దదౌతూందనీఈ పెళ్ళి చెయ్యాలనీ తెచ్చేసుకున్నాం మొన్ననే. మీ యింట్లో పువ్వుల మొక్కలున్నాయని వినీ యివాళ పారొచ్చింది నాతో. పైకి నంగిలా ముంగిలా మెత్తగా కనిపిస్తది కాని మా చెడ్డ అల్లరండి. మనువాడవే అంటే

వొద్దంటేది. సదుంకుంటూనని మారాము చేస్తది. మహకానిదై పోయింది బాబూ" పట్నం నీళ్ళొంట బట్టాయో ఏటో కాని పెంకిదేపోనాది" నవ్వుతూనే చెప్పింది ఆదెమ్మ.


'ఇప్పటి నుంచీ పెళ్ళేమిటి? చిన్నపిల్ల. అలాటి ఆలోచనలు మాను ప్రస్తుతానికి –" అని మల్లీశ్వరి వేపు చూశాడు. అతన్నెంతో మెచ్చుకుంటున్నట్లూ తన పక్షం పలికినందుకు కృతజ్ఞత చెబుతున్నట్లూ – విశాలమూ గుండ్రమూ అయిన తన కళ్లతో ఒక్కసారి కపర్దిని చూసి కనురెప్పలను చిత్రంగా అల్లల్లాడించింది మల్లీశ్వరి. ఆ అద్భుత భంగిమకు ముచ్చటపడుతూ... తల్లి వెనుక దాక్కున్న ఆమెను ముందుకు పిలిచి – "ఇంతకీ నీకు చదువెందుకూ?" సరదాగా అడిగాడు ఏం చెబుతుందో విందామని.

"సినేమా పేర్లు చదవడానికీ... నా పేరు రాసుకోడానికీ..."

నవ్వుకుని – "అలాగే చెబుతాను. నువ్వు శ్రద్ధగా నేర్చుకుంటూనంటే" అన్నాడు షరతు విధించబోతున్నట్లే. "ఓ!" అందామె కళ్లు చక్రాల్లా తిప్పతూ. అంతే.. మరునాటి నుంచీ మల్లీశ్వరి కపర్దికి శిష్యురాలూ... కాలక్షేపమూ ఐపోయింది. అ ఆ ఇ ఈ లూ.. ఆటపాటలూ... ఆలోచనలూ అన్నీ నేర్పసాగాడు. ఐదేళ్లలో ఆమె చాలావాటిలో ఆరిందా ఐపోయింది. మనిషి అజంతా శిల్పంలా రూపొందింది. విగ్రహమే కాకుండా మెదడూ వ్యక్తిత్వమూ కూడా పెంచుకుంది. చాలావిధాలా వ్యక్తి అయింది. అప్పుడు ఒకనాడు... లబోదిబోమంటూ వొచ్చారు ఆదెమ్మా... సింహాచలమూ. "కపర్ది బాబూ! ఎంత జెప్పినా మల్లి యాదగిరిని పెళ్ళాడననేస్తాంది. ఇంకా బలవంతం చేస్తే నుయ్యో గొయ్యో చూసుకుంటూనని బెదిరిస్తాంది. సిన్నప్పట్నుంచీ అనుకుంటున్న మేనరికం. కాదని బయటకెడితే బంధువులు గడ్డెడతారు. ఏనాడో చేసేవలసింది మనువు. పిల్లది అప్పడే కాదంటూంది కదాని అలుసిస్తే... ముద్దుచేస్తే... సూడండి బాబూ ఎలా తయారయినాదో.." గొల్లున ఏడిచాడు సింహాచలం. ఆదెమ్మ శ్రుతి కలిపింది.

తన చింతను బయట పెట్టుకుంటూ వంతపాడింది ఏడుపు గొంతుతో. మల్లితో మాట్లాడతానని వాళ్లని పంపించేశాడు. గంట తిరగలేదు. యాదగిరొచ్చాడు. సిగ్గులేకుండా తన పరిస్థితి చెప్పకున్నాడు. "అది పుట్టినప్పటి కాణ్నుంచి నా పెళ్ళామూ, నేను దాని పెనిమిటినీ సారూ... మనువు కాలేదనే కాని నా మనసువిండా మల్లే. అది నాకు దక్కకపోతే నేను బతకలేను బాబూ... దాన్ని పెళ్లాడకపోతే నా ప్రాణం నిలవదు సారూ... సరూ, తమరి మాటంటే దానికి యేదవాక్కట. తమరి మాట కాదనదట. అంతగురిట... సారూ! నన్ను తాళి కట్టనిమ్మని తనకి చెప్పొప్పించండి సారూ... మల్లిని నా దాన్ని చేసి నా బతుకు నిలిపి నన్నదృష్టవంతుణ్ని చెయ్యండి సారూ.." అని భోరున ఏడ్చాడు కాళ్లు పట్టుకున్నంత పనిచేసి.

కాని... యాదగిరి తరపున ఒక్క అనుకూలమయిన మాట చెప్పడానికేనా నోరు పెగలలేదు కపర్దికి. ఎలా పెగులుతుంది? మల్లీశ్వరి – బంగారు రంగు. యాదగిరిది బొగ్గు రంగు. మల్లీశ్వరికి కొంచెమయినా చదువు సంధ్యలున్నాయి. యాదగిరికి పొట్ట చించితే అక్షరమ్ముక్క లేదు. ఆమె ఎప్పడూ కడిగిన ముత్యంలా వుంటుంది. అతనేమో నూనె మరకలూ, మసి మచ్చల గుడ్డలతో మురికిగా వుంటాడు. ముఖ్యంగా మల్లీశ్వరికి యాదగిరంటే ఏ మాత్రమూ యిష్టంలేదు. మామ మంచివాడేకాని నేను మనువాడేందుకు కాదు అనేసింది. ఆమె నిర్ణయం కపర్దికెంతో ఆనందం కలిగించింది అంతరంగంలో. తన వద్దకు వొచ్చే వరకూ మల్లి మామూలు బంగారు ముద్ద. ఆ ముద్ద బంగారాన్ని మేలిమి బంగారు నగగా మార్చాడు తను అన్నీ నేర్పి. జాణనూ నెరజాణనూ చేశాడు మాటామంతీ నేర్పి. ఆమె మీద ఎన్నెన్నో ఆశలు పెంచుకున్నాడు. కలలు కన్నాడు. భవిష్యత్తు చిత్రించుకుంటూ వొచ్చాడు. తన మల్లీశ్వరి



ఏదేదో ఐపోవాలని కలలు కంటున్నాడు – ఆమెతో ఏర్పడిన ఐదారేళ్ల గాఢానుబంధానికీ.

ఊరిలో అపవాదొచ్చింది – కపర్దిని చూసుకునే మళ్లి పెళ్ళికొప్పుకోడం లేదని. ఆ అపవాదు కపర్ది వరకూ రాకుండానే – ఒక సాయంత్రం మల్లీశ్వరి వొచ్చి... "అర్జంటుగా ఐదు వేలు కావాలంది. తన వద్ద లేకపోతే అప్పచేసి మరీ యిచ్చాడు – అప్పటి కప్పుడు. తెల్లవారేసరికి – మల్లీశ్వరి కనిపించలేదు. కపర్దికి ఒక చీటీ మాత్రం అందింది.

'మనసు లేని మనువు మనుషులకి మహాశిక్ష అని – మేనరికం పిచ్చిలో మునిగిన మావాళ్లెన్నటికీ గ్రహించలేరు. మీ మీద నింద పడకుండా వుండేందుకు నేను ఊరు విడచి వెళ్ళిపోతున్నా నింకేమీ తోచక. నా జీవితాన్నీ భవిష్యత్తునీ నేనే వెదుక్కుందుకు విశాల ప్రపంచంలోకి వెళ్తున్నాను. నాకీ రెక్కలూ, ఆలోచనలూ కలిగించిన మీ కెప్పటికీ కృతజ్ఞురాలినే..." కపర్ది మహదానందపడ్డాడు. మల్లీశ్వరి యాదగిరి బారి నుండి తప్పించుకుని – తనకు తానుగా మంచి జీవితాన్నీ మనసున్న మనువునీ వెతుక్కుంటూ సాహసంతో ప్రపంచంలో కడుగువేసినందు కెంతో సంతోషించడు. ఆమె ప్రవర్తన ఆదర్శంగా భావించాడు. అభినందించాడు. మల్లీశ్వరినలాటి వ్యక్తిత్వం కలదానిగా తయారు చేసినందుకు మనసులో గర్వపడ్డాడు – ఆమె తల్లిదండ్రులు ఏడుస్తూంటే ఓదార్పు నటించినా. మల్లీశ్వరి వెళ్ళిపోయిన కొద్ది కాలానికే యాదగిరి సైకిలు దుకాణం ఎత్తేసి ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఆమె తల్లిదండ్రులు కూడా పల్లెలో పరువు పోయిందని కాబోలు ఫికరు లేకుండా పోయారు. కపర్ది మాత్రం ఏమీ బాధపడలేదు. దాంపత్యానికి జీవమూ, ప్రాణమూ అనుకూలత. మంచి మనువు కుదర్చడమెంత ఘనకార్యమో మనసు లేని మనువుని తప్పించడమూ అంత గొప్ప పనే అర్థంచేసుకోగలిగితే. మల్లీశ్వరి తీసుకున్న నిర్ణయం వెనుక తన పాత్రా వుంది. అదే తనకు గర్వకారణం. జీవితంలో ఓ మంచి పని చేశానన్న తృప్తి. మల్లీశ్వరి సాహసానికి మంచి ఫలం లభించాలి. ఆమె చక్కని జీవితాన్ని తనుకళ్లారా చూడగలిగితే – జీవితమే సఫలమూ, ధన్యమూ. కాని... ఎక్కడుంది మల్లీశ్వరి? ఎలా వుంది?

రైలాగింది. ఎవరో అరిచారానందంగా... "బెజవాడ"

కపర్దికి మాత్రం "కృష్ణా నది" అన్నట్లే వినిపించింది. దిగడానికి తొందరపడిపోయాడు. రాజమండ్రి వరకూ సరదాగానే సాగింది కానీ యాదగిరి కనపడి గతం గుర్తుతేవడంతో అక్కడి నుంచి ప్రయాణం అశాంతీ అలసటా ఐపోయింది. విసుగొచ్చేసింది. రైలూ ఆలస్యంచేసి తనని బాధించింది. విజయవాడ చేరేసరికి చీకటి పడిపోయింది.

స్టేషను బయటకు రావడమేమిటి, ఆరాటవు పెళ్ళికొడుకు పేరంటాలి మెడలో పుస్తెకట్టేశాడన్నట్లు ఎదురుగా వున్న బసలో దూరిపోయాడు. చన్నీటి స్నానంతో ప్రయాణపుచికాకును వొదుల్చుకుని... ఓ కప్పు కాఫీ తాగి... కొంతసేపు మంచం మీద వాలితే తప్ప మళ్లీ మనిషి కాలేదనిపించింది.

"ఏం కావాలో చెప్పండి సార్... మీరు స్నానం చేసొచ్చేసరికి రెడీగా వుంచుతాను" అన్నాడు కుర్రాడు పెట్టెను గదిలో అమర్చుతూ.

"కాఫీ... స్ట్రాంగ్‌గా... వేడిగా... చక్కెర తక్కువ."

వినరాని మాట విన్నట్లే చూశాడు కుర్రాడు "ఇప్పుడు కాఫీయా! వొద్దు సార్... ఆరోగ్యం పాడు. ఇదసలు కాఫీ వేళ కానే కాదు."

"మరేవేళ?"

"మందు వేళ సార్... మీరు భలేవారు సార్... తెలిసి నా చేత చెప్పిస్తున్నారు" – నవ్వి "మందంటే విస్కీ, బ్రందీలని కూడా నా నోటే అనిపిస్తారేమో..."

"నేనలాటివి తాగను–" – "ఎప్పుడూ తాగలేదు..."

"ఇంతవరకూ ఒక్కసారీ తాగకపోతే యిప్పుడు కచ్చితంగా తాగాలి సార్. జీవితంలో దేనినీ ఒక్కసారయినా చూడకుండా వొదిలీకూడదు సార్. మందంటే ఆషామాషీ కాస్సార్. ఒక్కసారి తాగారో వన్సుమోరే. మరి వదల్రు. భలేగా వుంటుంది సార్ మందుకొడితే... మీలాటి గొప్పవారి కోసం కాకపోతే మరెవరి కోసం సార్ మందు?"

పట్టుమని పదహారేళ్లు కూడా వుండని కుర్రాడి నోటి – జీవితం... అనుభవం లాటి పెద్ద పదాలు. బతుకు తాపత్రయం ఏదయినా నేర్పుతుందేమో మనిషికి! తనకి మిగిలే కొంచెం కమిషన్ డబ్బుల కోసం తన చేత మందు తాగించాలని... ఎంత శ్రమపడుతున్నాడు!

"నువ్వు తాగావా అంత యిదిగా చెబుతున్నావ్?"

"నేనింకా కుర్రాణ్ణే కద సార్? ఈ గదిలో – తాగిన వాళ్ల నెంత మందినో చూశాన్సార్. మందుకొట్టారో మీ అలసటంతా మటుమాయం. హాయిగా, సుఖంగా వుంటుంది. మీ సుఖం కోరే చెబుతున్నాను సార్. నాకు తెలుస్సార్... మీరు చాలా మంచివారు. మీ ముఖం చూస్తేనే తెలిసిపోతుంది. తెచ్చేస్తాను సార్... ఎలాగూ వందిచ్చారుగా... చాల్సార్..." జడివానలా మాటల వర్షం.

"మందు మాట దేముడెరుగు కానీ అర్జంటుగా కాఫీ..." అనేశాడు కపర్ది కుర్రాడు మరీ మొహమాట పెట్టేస్తూంటేకాదనలేకా వాడిని నిరోధించలేకాఆ. పిల్లవాడినేం కసురుకోగలడూ? అందులోనూ అలా గవ్వలగుత్తిలా గలగల వాగేస్తూంటే.

కృష్ణ నీరేమో చల్లగా సుఖంగా వుంది స్నానం చేస్తూంటే... ప్రాణం లేచివొచ్చింది. రేవు వీలుచేసుకుని కృష్ణలో ఓ ములుగు ములగాలి. కనకదుర్గని దర్శించుకోవాలి. తన ఛాదస్తానికి విసుక్కోడు కద ప్రసాదు? అంతగా ఐతే తనొక్కడే వెళ్తాడు వడిని వొదిలి. ఐనా వాడెందుకు కాదంటాడూ? తనంటే వాడికెంతో అభిమానం. అర్థంచేసుకోగలడు.

స్నానం చేసి వొచ్చేసరికి వేడి వేడి కాఫీ... కప్పులో. చాలా బాగుంది, స్ట్రాంగ్‌గా. కాఫీ ధ్యాసలో పడి కపర్ది కుర్రాడిని పట్టించుకోనే లేదు. వాడేం చేస్తున్నదీ చూడనే లేదు కాఫీ పారవశ్యంలో. మేజాబల్ల మీద గాజు గ్లాసులో మందు పోసి... మంచు ముక్కలువేసి... సోడా పోసి... పక్కన పళ్ళెంతో జీడిపలుకులు పెట్టి... సిద్ధంగా అమర్చాడన్నీ.

"రాత్రికి మిల్ట్రీ భోజనమే... అంటే – మాంసంభోజనమే కదా సార్?" పైకి వినయంగా అడుగుతున్నట్లే కనపడినా వాడి మాటలలో నిజానికి నిర్ణయమే. "మందు కొట్టాక మాంసమే మంచిది సార్..."

"నువ్వు కాస్సేపు అవతలకి వెళ్లి పనులు చూసుకోరాదూ?"

"మీ సేవల కంటె నాకు పన్లేముంటాయి సార్? మీ ఆనందమే మా భాగ్యం.. సరే.. ఓ గంటలో భోజనం పట్టుకొస్తాను–" వరమిచ్చి వెళ్ళాడు.

కపర్ది – గ్లాసులోని మందుని పారబోసి వొచ్చి



జీవిత గమనం కోసం..

నావికుడు లేకుండా నడిచే–
కాగితం పడవకైనా,
నీరంటూ ఉండాలి !
పేరెంట్సు లేకుండా పెరిగిన–
అనాథకైనా–
'పేరంటూ'ఒకటుండాలి

–జ్యోత్స్న

మంచం మీద వాలిపోయాడు. కిటికీలోంచి చల్లని గాలి... కృష్ణ మీద నుంచేమో. వీటిగాలిలాగే వుంది. ప్రాణం తెరిపిన పడుతోంది – ప్రయాణపు విసుగు విరుగుతోంది. ఆ పరవశంలో ఎంతసేపు గడిచిందో... కుర్రాడు వచ్చేశాడు భోజనంతో. బల్ల శుభ్రం చేసి... క్యారియర్ విప్పి... అన్నీ అమర్చాడు పొందికగా.

"రండి సార్... వేడివేడిగా తింటేనే వొంటికి మంచిది. అందులోనూ హోటల్ భోజనం కూడాను" వాడి ఆతిథ్యానికి మురిసిపోతూ – "నీ పేరేమిటోయ్?" అడిగాడు.

"దుర్గారావండి"

"నువ్వూ నాతో తిను. ఈ భోజనం... యింత భోజనం నా వొక్కడికీ ఎందుకూ?"

"మీరు భోంచెయ్యండి సార్! మిగిలితే తింటాను."

"మిగలక? నేనేం బకాసురుణ్నా? రా... ఒక్కసారే యిద్దరమూ తిందాం... లేకపోతే నేనూ తినను. కలసి తింటే కలదు సరదా..."

"మీరు నన్ను మరీ మొహమాట పెట్టేస్తున్నారు. సరే... కానివ్వండి" అంటూ కపర్దికీ, తనకీ కూడా వొడ్డించాడు. భోజనం చేస్తూ –

"అమ్మగారిని కూడా తీసుకురావలసింది సార్ తమతో..." అన్నాడు మెల్లగా.

"ఉంటే అలాగే తీసుకువొద్దును. కాని... లేదు... ఐదేళ్ల కిందటే..." ఆయన గొంతులో విషాదం.

"అయ్యో! సారీ సార్... క్షమించండి సార్... తెలియక మీ మనసు నొప్పించాను. మన్నించండి సార్. .. అన్నట్లు మందు బాగుందా?"

అతగాడిని నొప్పించడమెందుకని... "ఆ మందు నేమందును? అమితానందమే... ." నవ్వాడు.

కపర్దికి పెరుగు వేస్తూ "ఐదేళ్ల నుంచీ ఆడవాళ్లు లేకపోతే అతి కష్టమే" తెగ సానుభూతి నింపాడు దుర్గారావ్ తన కంఠంలో.

"కష్టమయినా నష్టమయినా చేయగలిగిందేముంది? మానవ మాత్రులం" నిట్టూర్చు.

"మానవులు తలచుకుంటే చేయలేని దేముంది? డబ్బుండాలేకాని ఎలాటి కష్టాలకేనా సుఖాలుండి తీరతాయి.

చెయ్యి కడుక్కుని వొచ్చిన కపర్దికి తువ్వాలందించి... "ఐదేళ్ల నుంచి దూరమై మరచిపోయిన ఆ సుఖాన్ని... ఆడ సుఖాన్ని ఈ రాత్రి మీరు మళ్లీ పొందగలరు..." అన్నాడు కొంచెం జంకుతూనే.

"ఏమిటి నీ ఉద్దేశం?" నిజంగానే అర్థంకాలేదు కపర్దికి.

"అదే సార్... అమ్మాయి... ఆడ హాయి..."

కపర్ది కళ్లెర్రజేశాడు – "చనువిస్తే నెత్తికెక్కి నాట్యం చేస్తున్నావే! అవ్వతో వసంతమా! నాతో పరిహాసమా?"

"హవ్వ! మీరు అవ్వేమిటి సార్? మీ




వయసు – నలభయ్యేనా? నలభైలో మగవాడికి మళ్లీ యవ్వనం.. ." – "అమ్మాయంటే అమ్మాయికాదు. బంగారు బొమ్మాయే"

"నీ భాషా చమత్కారాన్ని మెచ్చాను కానీ నా వయసేభై ఎనిమిది–"

"నిజంగా? నమ్మలేకపోతున్నాను సర్... నన్నాటలు పట్టించడంలేదు కద అబద్ధమాడి? మీ వొంటి బిగువూ అదీ... నలభయ్యేళ్ల వాళ్లలాగే కనిపిస్తున్నారే. తల పండలేదు..."

"కనిపించినా మానినా నా వయసు మాత్రం యాభై ఎనిమిదే. నువ్వు నమ్ము... మాను..."

"ఏభై ఎనిమిదే ఐనా డబ్బుగల మగాళ్లకదో పెద్ద వయసేమీ కాదులెండి. మీ కంటే చాలా ముసిలివాళ్లే ఈ గదికి రాత్రులు రమణులని రప్పించుకుంటూంటారు. ఒక్క రాత్రి చూడండి. మందిచ్చే ఆనందం కంటె కూడా పసందయిన పొందు నిందే. పదకొండుకి మీ గది తలుపు చప్పుడవుతుంది. తెరచి చూడండి" కపర్ది ఏదో




# కోరినంత వరముల నిచ్చే కోదండ రాయడువాడు

దీపావళి శుభాకాంక్షలతో

పత్రికా రంగం, పౌర సంబంధాల విభాగంలలో విశిష్ట ప్రఖ్యాతి గాంచిన వ్యక్తులచే అందించబడుతున్న సేవా సంస్థ

మా తిరుపతి కార్యాలయం:

**SRINIVAS AWAAS GRIHA**
Opp: Town Club, TIRUPATHI

మధ్యతరగతి భక్తులు ఏ మాత్రం ఇబ్బంది కలుగకుండా శేషశైల వాసుని దర్శించి, తరించాలని ఆకాంక్షతో ప్రారంభించబడుతున్న సంస్థ




**సభ్యత్వం పొందిన రోజు నుండే 20 సం. ఎప్పుడైనా మా సేవ పొందవచ్చు**

★ బెడ్ రూం + వంటగది
★ రైల్వేస్టేషన్ లేదా బస్సు స్టాండ్ నుండి 5 నిమిషాల ప్రయాణం
★ హార్దిక స్వాగతం
★ కొండ మీదకు రవాణా
★ కళ్యాణ టిక్కెట్టు ఏర్పాటు
★ హనీమూన్ దంపతులకు ప్రత్యేక ఏర్పాటు
★ అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ సుఖం

వివరాలకు: **SRINIVAS AWAAS GRIHA**
Parijat Complex, Fraser Road, **Patna-800 001**

(పూర్తి వివరాలకు దీపావళి దినపత్రిక చూడండి)




చెప్పబోతున్నా వినిపించుకోకుండా క్యారియరూ, ఆకులూ అవీ పట్టుకుని గబగబ వెళ్ళిపోయాడు దుర్గారావు.

కపర్ది యిరుకున పడ్డాడు. అరవయ్యో యేట అగ్గి గండమన్నట్లు... మూడేళ్ళు సాముచేసి ముసలిదాన్ని కొట్టాడన్నట్లు... యిన్నాడు తనకి వ్యభిచారమా! ఇంత చవకబారు బస అని తెలియక దిగాడిక్కడ... ఇప్పుడేం చెయ్యడం?

వాచీ చూశాడు. ఎనిమిది మాత్రమే అయింది. బట్టలు వేసుకుని భద్రత కోసం డబ్బు సంచీ జేబులో పెట్టుకుని గదికి తాళం వేసి బయలుదేరాడు.

గదుల వరుసలు... ఒక్కొక్కటి దాటుకువెళ్తూంటే –

"ఇవాళ యింకెవరూ లేరక్కా... నేనేమో ఆయనకి మాటిచ్చేశాను. నా కోసమయినా నీ మనసూ, పద్ధతీ మార్చుకో నీలక్కా. ఐనా వొంటినిండా అందమూ, సొగసూ పెట్టుకుని నీ కెందుకక్కా కుక్కబతుకు? ఎందుకు బతకాలి చాలీచాలని బతుకు? ఎందుకు కష్టపడాలి? ఆలోచించక్కా... నీకా డబ్బు... నాకా కమిషను... ఇద్దరికీ లాభమే. ముసిలాడు కదా ఎక్కువే యిస్తాడు. బాగా వున్నవాడిలా కూడా వున్నాడు. మనిషి మెత్తని వాడూ, మంచివాడూ, మొహమాటస్తుడూ. మందు కొట్టించడనికే నాకు తల ప్రాణం తోక కొచ్చిందంటే నమ్ము... వంటలు చేసి ఏం బతుకుతావ్? ఈ ప్రపంచంలో డబ్బే తప్ప మరే నీతీ లేదు నీలక్కా. అంతఃపురంలో వుండవలసిన దానివి. ఆలోచించకుండా అన్యాయంగా అగచాట్లు పడుతున్నావు."

"నువ్వు నాకు బతుకు గురించి పాఠాలు చెబుతున్నావా తమ్ముడూ... జీవితంలో ఢక్కామొక్కీలు తిన్నదాన్నీ, దగాపడినదాన్నీ, చావలేక బతుకుతున్నదాన్నీ. తమ్ముడూ! మరచిపోకు, నేను నీ కంటె పెద్ద దాన్ని..." నవ్విందామె.

ఆ కంఠం... విస్మెరపోయాడు కపర్ది. నిర్ఘాంతపోయాడు. ఒక పక్క కుతూహలం... మరోపక్క విపరీతమయిన భయం... తన ఊహ నిజమో కాదో నిర్ధారించుకోవాలని – నిజం కాకూడదని వెయ్యిదేముళ్లకి మొక్కుకుంటూనే – గదిలోకి తొంగి చూశాడు. ఆమె ముఖం... గదిలోని దీప కాంతిలో... విస్పష్టంగా... సందేహం మిగల్చకుండా...

గుండె ఆగినంత పనయింది కపర్దికి. ఊపిరాడనివ్వనంత ఉద్వేగం. ఉద్రేకం... జీవితంలో చిత్తుగా ఓడిపోయిన భావం... బాధ... భయం... సిగ్గు... కసి... ఇక అక్కడ క్షణమయినా నిలబడలేక తన గదిలోకి వొచ్చి పడ్డాడు నిలువునా వొణికిపోతూ.

రాత్రి తన గదిలోకి రాబోయేది ఈమె అన్న మాట! బాధగా కళ్లు మూసుకున్నాడు. దిగ్భ్రాంతి... విభ్రాంతి. తొలిసారిగా అతనికి దేముడి మీద కోపమొచ్చింది. మానవ జీవితం ఎంత నాటకమయినా యింత వింతగానూ, విషాదంగానూ ముగించాలా రచయిత విధాతా? ఎందుకింత కాఠిన్యం నీకు నువ్వు సృష్టించిన మనుషుల మీద? వారి కన్నీళ్లతో ఏం బావుకుంటావు నువ్వు? దారం తెగిన ప్రతి గాలిపటమూ ముళ్ల కంపకే చిక్కుకుని చిరిగిపోవాలా? మంచి గంధపు చెట్టు ఆశ్రయమెందుకు లభించకూడదూ కొన్నిటికయినా? అసలు... తన జీవితమూ, సుఖమూ వెదుక్కోవడం దారాన్నీ ఆధారాన్నీ తెంపుకోవడం ఎందుకవుతుంది? అంతే అయితే... అదే నిజమయితే... మల్లీశ్వరి జీవితం యిలా భగ్నమూ పాడూ కావడానికి తన బాధ్యత కూడా తక్కువేమీ కాదు. ఆమె బతుక్కి తగిలిన రాళ్లలో తనవీ వున్నాయేమో. ఊహూ... వీల్లేదు. అలా జరగకూడదు. తాను నీరు పోసి పెంచిన మొక్క పూలతో కలకలలాడాలి కాని చీడపట్టి నశించకూడదు. మల్లీశ్వరి సుఖపడాలి. అందుకు తానేమయినా చేస్తాడు. చెయ్యాలి. చేసి తీరాలి. తన జీవితానికున్న అనేక అర్థాలలోనూ పరమార్థాలలోనూ ఆమె ఒకటి. కాని... తాను పాలనుకుని పోసినవామెపాలిట విషాలైనట్లుంది. కపర్ది ఉద్రేకంగా లేచాడు. పెద్ద మొత్తంలో డబ్బు జేబులో పెట్టుకుని – ఆవేశంగా తొందరగా బయటకు బయలుదేరాడు. ఆటోని పిలిచాడు.



కాలేజీ బ్యూటీ–
ఏపిల్స్ చెట్లకే కాదు
బుగ్గలకీ కాస్తాయంటే
పళ్లుచెట్ల మీంచేకాదు
నోట్లోంచీ రాల్తాయట,
ఓ బాపు బొమ్మ

–జ్యోత్స్న

పదకొండుకి యిక పావుగంటే వుంది. హోటలు గదులలో చాలా వరకూ నిశ్శబ్దంగా వున్నాయి కానీ ఆరో నంబరు గదిలో మాత్రం దీపం వెలుగుతోంది. వాళ్లిద్దరూ మాట్లాడుకుంటున్నారు.

"నీలక్కా! ఆయన నీ కోసం ఎదురు చూస్తూ మేలుకు కూర్చున్నాడు. ముసిలాడికి దసరా సరదా..." నవ్వుతూ ... "నీ కోసం ఆయన ఎన్ని కొన్నాడో తెలుసా? పువ్వులు, పళ్ళు, కొత్త బట్టలు... బహుశా బంగారు నగలు... చూడబోతే పెళ్ళి సామానుల్లా వున్నాయి" అన్నాడు దుర్గారావ్ నీలక్కని ఊరిస్తున్నట్లే. "పెళ్ళో... శోభనమో..."

"నీ మొహం! పెళ్లేమిటి? ఎవరికి?"

"ఆయనకేనేమో... ఏం? .. మగాడు... భార్య లేదు. డబ్బుంది. ఎంత వయసయితే ఏం? ఈ రోజుల్లో ఏంజరిగితే విడ్డూరమని?" – "ఆయన వయసు అరవైకి రెండు తక్కువేగా?"

ఒక్కసారామె ముఖం మారిపోయింది. కోపంగా... అసహ్యంగా ఐపోయింది. హఠాత్తుగా లేచి నిలుచుని – "పన్నెండు కదూ ఆ మహానుభావుడు దిగినది?" అడిగింది వెళ్ళబోతున్నట్లు.

"వెళ్తున్నావా నీలక్కా! వెరీగుడ్... ఇప్పటికేనా నీ మనసు మారిందదే చాలు. ఇక మన బతుకులు బంగారమే. ఈ మలుపు ఏ మంచికో..."

విసురుగా తలుపు తట్టిందామె. గదిలో పెద్ద దీపం వేసి తలుపు తెరిచాడు కపర్ది.

అతన్ని చూసి "మీరా!" అంటూ విశ్చేష్ట ఐపోయిందామె.

"నేనే మల్లీశ్వరీ"

ఆమెకు కరచరణాలాడడంలేదు. నోరు పెగలడం లేదు. ఒక్కసారి భోరున ఏడిచేసింది.

రాత్రి యథావిధిగా నడుస్తోంది. కాలం – గడుస్తోంది.

xxx

తెలతెలవారుతోంది. ఐనా విజయవాడ జంక్షన్ కోలాహలంగానే వుంది. ఏదో రైలు రావడాన. ఎక్కేవారు, ఎక్కించడానికొచ్చేవారు... దిగేవారూ దింపుకుందుకు వొచ్చేవారూ... జనం... జనం...

"ప్రసాద్!" కపర్ది కంఠం నిండా అభిమానమూ, ఆపేక్షా, ఆప్యాయతా.

"నాన్నగారూ!"... "నా కోసం శ్రమపడి వచ్చారా" అంటూ అతనాయనని కౌగలించుకున్నాడు.

"శ్రమేముంది! సంతోషమే తప్ప. ఆ... బాగున్నావా?"

"ఓ! మీ ఆశీర్వచనం వల్ల హాయిగా వుంటున్నాము. బసకి పోదామా?"

"అంతకంటె ముందు... నీ కభ్యంతరం లేకపోతే... మరో చోటుకి.." వెళ్దామా అన్నట్లు చూశాడు కపర్ది.



## మైలవ్

పాపనవ్వితే పాలనవ్వు
ఆమె నవ్వితె 'అర్ధ'నవ్వు
తలబోడి తవ్వితే బోసినవ్వు
పూబోణి నవ్వితె నాకులవ్వు!
ఓ బావు బొమ్మా!

—జ్యోత్స్న




ప్రసాద్ ఆటోని పిలిచాడు.

ఆటో పరుగెడుతూంటే కపర్ది మనసూ పరిపరి విధాల పోతూంది. తాను చేసిన తప్పని తన కొడుకు క్షమిస్తాడా? జరిగింది విని... ఏమంటాడో? ఏం చేస్తాడో. అసలు... తను... వాడికి... సిగ్గు విడిచి చెప్పగలడా?

ఇద్దరూ కృష్ణలో స్నానం చేసి ... వొడ్డున యిసుకలో కూర్చున్నారు. శీతాకాలవు ఎండ వెచ్చగా వుంది.

“ప్రసాద్! నీతో మాట్లాడాలి. కొంచెం ఎక్కువే మాట్లాడాలి” సహనంగా వినగలవా అన్నట్లు చూశాడు.

“మీ మాటలు వినడం నాకు చాలా యిష్టం నాన్నగారూ. అలాటి అవకాశాలే అరుదు...”

“ఔను. చిన్నప్పటి నుంచీ నువ్వు హాస్టళ్లలో వుండి చదువుకోడం... చదువ గానే ఉద్యోగం రావడం... మహానగరాలకే నీ నివాసం పరిమితం కావడం... అలాటి కారణాలుగా ప్రసాద్! నేను నిన్ను చూసి గర్వపడుతూంటాను. ఎంతో సంతోషిస్తూంటాను. ఎందుకంటే... నువ్వు బాగా చదువుకుని ప్రయోజకుడివి కావడమే కాదు, సరయిన వ్యక్తిగా కూడా రూపొందావని”

“మీ ఆశీర్వచనం నాన్నగారూ”

“నా అదృష్టం బాబూ అది. ఈ రోజులలో నీలాటి కొడుకు ఎంత పుణ్యం చేసుకున్న తండ్రికో...”

“చిన్నవాళ్లను పెద్దవాళ్ళు పొగడకూడదంటారుగా నాన్నగారూ...” నవ్వాడు ప్రసాద్.

“ఔనౌను... ప్రసాద్!... మనం ఒకరి కొకరం దగ్గరగా గడిపిన కాలం తక్కువ. మన అభిమానాలకూ, అంతఃకరణలకూ ఉత్తరాలే వారధులు అవుతూ వొస్తున్నాయి. అందుచేత నా జీవితం గురించి నీకు బాగా తెలిసే ఆస్కారం తక్కువ. నా జీవితం బాగానే గడుస్తూ వొచ్చింది - రెండు అపశ్రుతులు మినహా-”

“మొదటిది అమ్మ మరణం -” - “రెండవది?”

“చెబుతాను... అంతకు ముందు మరొకటి చెప్పాలి. నేనొకసారి అప్పు చేశాను. తీర్చకపోవడంతో అది వడ్డీతో అంతింతై వటుడింతై అన్నట్లు పెరిగిపోయింది-” - “ఐతే ఏం? నేను చేసిన అప్పు నువ్వు తీర్చావు...”

“అది నా బాధ్యత...”

“నిజానికి కాదు. సరేలే... నేను చేసిన అప్పు నేనడగకనే తీర్చావు. ఇప్పుడు... నేను... నిన్ను... నోరు తెరచి అడుగుతున్నాను. అర్ధిస్తున్నాను” కపర్దిలో వొణుకు.. కంఠంలో గాద్గదికం.

“నాన్నగారూ!” కంగారుగా చూశాడు ప్రసాద్ తండ్రి వేపు.

“నా కేమీ కాలేదు... ప్రసాద్! నేను చేసిన అప్పు తీర్చినట్లే నేను చేసిన తప్పు కూడా దిద్దితే...”

“నాన్నగారూ! మీరు తప్పు చెయ్యడమా!” నమ్మలేనట్లే చూశాడు.

“నేనూ మనిషినే కదా?”

“అభ్యంతరం లేకపోతే... చెప్పదగినదయితే... చెప్పండి...”

“మల్లీశ్వరి కప్పుడు పన్నెండు పదమూడేళ్లు. మట్టిలో మాణిక్యం. బంగారం ముద్ద. ముడి వజ్రం. సానపడితే ప్రకాశిస్తుందనిపించింది. చదువు సంధ్యలతోపాటు నా సిద్ధాంతాలూ నేర్పాను. ఆమె నా కొక విధమయిన ఆలంబనగా దొరికింది. నా కలలనూ, ఊహలనూ ఫలింపజేసుకుందుకామె నా కొక సాధనమయింది. ఆమెను వ్యక్తిగా తీర్చిదిద్దాలని నా ప్రయత్నం. ఆమెలో నా సాఫల్యం దర్శించాలని.. . ఆమె అలాగే రూపుదిద్దుకుంది. మనసు లేని మనువుని కాదని... తన బ్రతుకూ, భవిష్యత్తూ తానే వెదుక్కుంటూ ఒంటరిగా వెళ్ళిపోయింది విశాలప్రపంచంలోకి. కాని... ఈ ప్రపంచం స్వచ్ఛమైనదీ, సరళమయినదీ కాదనీ, కుటిలమైనదనీ నిరూపించుకుందామె విషయంలో కూడా. మల్లీశ్వరి దగాపడింది. నిన్న రాత్రి హోటల్‌లో విచిత్రంగా ఎదురయిందా పరిదీన. నాకు దుఃఖమే వొచ్చింది. ఆమె మానాన ఆమెను వదిలెయ్యక చదువూ సంస్కారమూ వ్యక్తిత్వమూ అంటూ నేనే ఆమె ఈ స్థితికి పాకుదురాళ్లు పేర్చానేమో అన్న అపరాధ భావన నన్ను తినెయ్యసాగింది. ఆమె బ్రతుకుని పూవుని చేయబోయి ముల్లును చేశానే అని... మధనపడ్డాను. ఆమె పరిస్థితికి పరిష్కారం చూపవలసిన నైతిక బాధ్యత నాదే అని నా ఉద్దేశం. కళ్లు తుడుచుకున్నాడు కపర్ది. నేనామెనలా చూడలేను. భరించలేను. అదీ నా బాధ. అదీ నేను చేసిన తప్పు.”

“ఆమె వయస్సెంత?” అడిగాడు ప్రసాద్.

“మనవూరు వొచ్చినప్పుడొకసారి చూశాను కానీ... గుర్తు లేదు”

“ఇరవయ్యొయిదో, ఇరవయ్యారో...”

“ఐతే సమస్యేముందీ? పెళ్లి చేస్తే సరి -” తేలికగా అనేశాడు.

“చేసుకునేవారుండాలిగా.”


“చక్కనిదనీ... సంస్కారనీ... వ్యక్తిత్వం కలదనీ మీరే చెబుతున్నారుగా?”

“మల్లీశ్వరి అమలిన పద్మమే. కాని యిప్పటి వరుడికి కట్నం, కులం, చరిత్ర, శీలం - ఇలాటివి కదా కావాలి? డబ్బు మనుషులూ, కులం మనుషులూ తప్ప జీవితం మనుషులెందరున్నారు? ఆమెను ఆమెగా స్వీకరించగలిగే విశాలహృదయుడూ, నిజమైన వ్యక్తీ వున్నాడో లేడో? ఉన్నా - మనకి లభించాలి” ఆయన కంఠంలో అనుమానం... నిరాశ... నిస్పృహ.

“నాన్నగారూ! నేను మీ కొడుకుని. నన్ను మీరు ఆజ్ఞాపించవచ్చు. నన్ను మీరర్థం చేసుకోలేదూ?

నేను మీకు సర్వవిధాలా వారసుడినే కాగోరుతానే. నన్నెందుకవమానిస్తున్నారిలా అనుమానిస్తూ?”

“ప్రసాద్! బాబూ!” సంతోషమూ... సంబరమూ పట్టలేకపోయాడు కపర్ది. “నా జన్మ



## జిస్కీబిబీ మోటీ

నెనెక్క వలసిన రైలు
అయితే జీవిత కాలం లేటు
అలిగి పుట్టింటి వెళ్లిన
శ్రీమతి ఎక్కొస్తున్న రైలు
అగును ఎన్నియుగాలైనా లేటు!

—జ్యోత్స్న




ధన్యమే చేస్తున్నావు నాయనా. నిజమైన పుత్రోత్సాహం అనుభవానికందిస్తున్నావు. నువ్వు నా కొడుకువి మాత్రమే కాదు... మనిషివి... పరిపూర్ణ వ్యక్తివి. నా కెంత తృప్తిగా గర్వంగా వుందో నిన్ను చూసుకుంటూంటే... ఇది చాలా బాబూ నాకు. ఈ వరమూ, అదృష్టమూ చాలు. నేను వెలిగించిన దీపం కొడిగట్టకుండా మళ్లీ జాజ్వల్యం చేసే మహదవకాశం ప్రసాదించే నీకు నేనెంతయినా కృతజ్ఞుణ్ణి. తొందరగా పద బాబూ... ఈ శుభవార్త మల్లీశ్వరికి చెప్పి... మిగిలిన విషయాలు చూసుకుందాం..." ఆటో పరుగెదుతూంటే అడిగాడు ప్రసాద్... "మరి... మీ రెవరికో... పెళ్లిచూపులకి వొస్తామని..."

"జరిగింది విన్నవించి... మా వాడికి పెళ్లయిపోయిందని చెప్పి – క్షమించమంటాను. ఔను బాబూ! నీ కివ్వడే పెళ్లి... పెళ్ళికూతురూ, మంగళసూత్రం, పీతాంబరాలూ అన్నీ సిద్ధంగానే వుంచాను బసలో. నాకెంత సంబరంగా వుందో! మహదానందంతో నోట మాట రావడం లేదంటే నమ్ము"

"మిమ్మల్నింత సంతోషపెట్టగలుగుతున్న నా జన్మ ధన్యమే. నా పుట్టుక పుణ్యమే"

ఆటో ఆగింది. కపర్ది లోపలికి వెళ్లాడు హడావిడిగా. అక్కడ... ఆమె... ఒంటరిగా...

"నేను చెప్పలేదూ మల్లీశ్వరీ, ప్రసాద్ నా కొడుకని! నాకు వాడి మీద అంత నమ్మకముండబట్టే నిన్న రాత్రే కొన్నాను పెళ్ళి సామగ్రి. త్వరగా పద. ఆటోలో ఎదురుచూస్తున్నాడు పెళ్ళికొడుకు. మీరిద్దరూ – ఒకరు సువర్ణమూ, మరొకరు సౌరభమూ. అద్భుతమూ అపురూపమూ అయిన జంట. పద పద... అన్నట్లు.. పెళ్ళి సంబరం ముగిసి తీరిక చిక్కాక నా కొకటి జ్ఞాపకం చెయ్యి. యాదగిరికి ఉత్తరం రాయాలని..."

"యాదగిరికా! అతని కుత్తరమెందుకూ? ఏమనీ?"

"ఏమనా?" గర్వంగా నవ్వుతూ అన్నాడాయన – "యాదగిరీ, మల్లీశ్వరితో మనువు తప్పడం నీ అదృష్టమన్నావు కానీ – ఆమెకు చాలా మంచివాడూ, విశాలహృదయుడూ... అందగాడూ... నెలకి పది వేల ఆర్జనపరుడూ, అత్యంత అనుకూలుడూ భర్తగా లభించాడు. ఆలోచించుకో – ఆమెతో మనువు తప్పడం నీ అదృష్టమో నీతో పెళ్ళిని తిరస్కరించిన ఆమె అదృష్టవంతురాలో... అని"

"ఎందుకూ అలా రాయడం?"

"నీకు తెలియదులే... పద పద"

"సామానంతా ఆటోలో పెట్టేశాను సార్..." వినయంగా – చేతులు కట్టుకుని నిలబడ్డాడు దుర్గారావ్.

"నువ్వూ రా నీలి పెళ్లికి–"

"నేనా! నేనెందుకు సార్! నే నెవరినని? ఏమౌతాననీ?"


"నీలక్క... మల్లీశ్వరికి తమ్ముడిలాటివాడివి. ఈ కథకు సూత్రధారివి. నువ్వు లేకపోతే ఎలా?"

మల్లీశ్వరి కపర్ది పాదాలకభివందనం గావించబోయింది – సజలనయనాలతో. ఆమెను వారించి "ఇప్పుడు కాదు. కోడలిగా... నా కొడుకుతో కలిసి... అప్పుడు జంటగా నమస్కరిస్తే – నేనెంతో గర్వంగా... ఆనందంగా... మిమ్మల్నాశీర్వదించి... నా మహద్భాగ్యానికి మురుస్తాను" అన్నాడు.

ఒకటి రెండు నిముషాల అనంతరం... దుర్గగుడి వేపు పరుగెత్తసాగాయి రెండు ఆటోలు – పెళ్ళి తొందరలో. ఆ పెళ్ళివారికి –

కనకదుర్గ కోవెల గంటలు గణగణమంటూ స్వాగతం పలుకుతూంటే–

బిరబిరా పరుగులిడుతున్న కృష్ణమ్మ గలగలమంటూ వధూవరుల నాశీర్వదిస్తోంది.




# హైకూలు

మంచులో
ఏదో సంభాషణ
నా వేపు నడిచివస్తోంది

వాన నేల లోంచి
పచ్చని గడ్డి మొనా
కీచురాయి చప్పుడూ

ఒక కీచురాయి
చాలు
ఈ చీకటిని నింపడానికి

చీకట్లో మిణుగురు గుంపు
నేనూ మిణుగురునైతే
బాగుండు

రాత్రి మృదువుగా లేదు
ప్రతి నిముషం
కీచురాళ్ళ శబ్దం

ఈ కీచురాళ్ళ చప్పుడు
చందమామని కూడా
చేరుతోందా?

ఆలోచనలా చూడలేదు
ఇందాక ఎక్కడో
ఆ పసుపు పూలు

పాట అంచులు పట్టుకుని
పాపాయి నిద్రలోకి
జారింది

సంభాషణలో విరామం
ఎప్పటి నుంచో
ఓ కీచురాయి అరుస్తోంది

నేనూ చంద్రుడూ రాత్రీ
మా ఒంటరితనమే
మా పరిపూర్ణత

బి.వి.వి.ప్రసాద్